# పేదలకు 'సురక్ష' ఇళ్ల వద్దకే ప్రభుత్వ ఫలాలు

- అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ ధ్యేయం
- ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, ఎమ్మెల్యే శిల్పారవిచంద్రకిశోర్‌రెడ్డి


లబ్ధిదారులకు ధ్రువ పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, ఎమ్మెల్యే శిల్పా రవి

**నంద్యాల(సిటీ):** జగనన్న సురక్ష పేదలకు వరం లాంటిదని ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డిలు అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఫారుఖ్‌నగర్, బాల్కొండహాల్, గుడిపాటిగడ్డ, ముల్లాన్‌పేట, బాలాజీ కాంప్లెక్స్ ప్రాంతాల్లో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించి 1,797 మందికి ధ్రువపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఏదైనా ధ్రువీకరణ పత్రం పొందాలంటే ఎన్నో రోజులు పట్టేదన్నారు. జగనన్న ప్రభుత్వంలో సులభంగా, పైసా ఖర్చు లేకుండా అతితక్కువ సమయంలోనే అందుతుండటంతో అన్ని వర్గాల వారు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. అవసరమైన వారు ధ్రువీకరణ పత్రాల కోసం సచివాలయాల్లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ షేక్ మాబున్నిసా, మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు, తహసీల్దార్ శ్రీనివాసులు, కౌన్సిలర్లు అబ్దుల్ మజీద్, శ్యామ్‌సుందర్‌లాల్, కలాంబాషా, తౌహిద్, కో ఆప్షన్ సభ్యులు సలాముల్లా, 12వ వార్డు ఇన్‌చార్జ్ గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


**ఇతని పేరు కే.శివశంకర్.** తల్లి శివమ్మకు గతంలో ఇచ్చిన ఆరోగ్యశ్రీ కార్డులో ఫొటో లేకపోవడంతో ఆస్పత్రులకు వెళ్లిన సమయంలో పలుమార్లు ఇబ్బందులు పడ్డారు. వివరాలు వలంటీర్‌కు అందజేయడంతో తల్లి ఫొటోను చేర్చి కొత్తకార్డు ఇవ్వడంతో ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఇంత త్వరగా ఆరోగ్యశ్రీ కార్డును సరి చేసి ఇవ్వడం నమ్మలేక పోతున్నానని చెప్పారు.


**ఈమె పేరు నేతి లక్ష్మీరాజేశ్వరి,** భర్త ఎన్.రవికుమార్. రెండు రోజుల క్రితం తమ కూతురు నేతి భవితకు సంబంధించిన కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం వలంటీర్ ఇంటి వద్దకు వచ్చి మరీ దరఖాస్తు పూర్తి చేసుకుని వెళ్లారు. శుక్రవారం జగనన్న సురక్ష సదస్సులో సర్టిఫికెట్ ఇవ్వటంతో ఆమె ఆశ్చర్యాం వ్యక్తం చేశారు.

- ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి


ఎర్రగుడిదిన్నెలో ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే బిజేంద్రారెడ్డి

**రుద్రవరం:** లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి ప్రభుత్వ ఫలాలు అందజేస్తున్నామని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఎర్రగుడిదిన్నెలో శుక్రవారం నిర్వహించిన జగనన్న సురక్ష సదస్సులో ఎమ్మెల్యే పాల్గొని 232 మందికి వివిధ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఏవైనా పథకాలు పొందాలంటే మధ్యవర్తులకు డబ్బు సమర్పించుకోవాల్సి వచ్చేదన్నారు. అయినా సరైన సమయంలో సర్టిఫికెట్లు అందక ప్రజలు ఇబ్బంది పడేవారన్నారు. తమ ప్రభుత్వంలో అవసరమైన ప్రతిఒక్కరికీ ఎలాంటి ఖర్చు లేకుండా, అతితక్కువ సమయంలోనే కావాల్సిన సర్టిఫికెట్ అందజేస్తున్నామన్నారు. ఈ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆళ్లగడ్డ వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ గంధం రాఘవరెడ్డి, తహసీల్దారు రవీంద్రప్రసాదు, ఎంపీడీఓ మధుసూధనరెడ్డి, గ్రామ పెద్దలు క్రిష్టారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, సహకార సంఘం డైరెక్టర్ గోపిరెడ్డి పుల్లారెడ్డి, నాయకులు సోమశేఖర్‌రెడ్డి, ఏఈలు వెంకటరాముడు, ప్రమోద్, రాఘవేంద్రారెడ్డి, వ్యవసాయాధికారి శ్రీకృష్ణ పాల్గొన్నారు.

**దొర్నిపాడు:** జగనన్న సురక్ష పథకం ప్రజల సంక్షేమానికి రక్షణగా నిలుస్తోందని ఎంపీపీ గోపవరం అమర్‌నాథ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బుర్రారెడ్డిపల్లె గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించి 250 మందికి ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుబ్బారెడ్డి, తహసీల్దార్ జయప్రసాద్, ఏఓ సునీత, జెడ్పీటీసీ శకుంతల, సొసైటీ చైర్మన్ భూమా చెంచిరెడ్డి, నాయకులు శ్రీపతి ప్రసాద్, పుల్లారెడ్డి, శ్రీరాములు, పీఎస్ మహేష్ పాల్గొన్నారు.


**ఈ చిత్రంలో ధ్రువపత్రాన్ని చూపుతున్న వ్యక్తి పేరు నరేంద్ర.** ఈయన బుర్రారెడ్డిపల్లె గ్రామవాసి. తల్లి, తండ్రి, భార్యతోపాటు మొత్తం ఆరుగురు కుటుంబ సభ్యులు. అయితే గతంలో తల్లిదండ్రులు కొన్ని ప్రభుత్వ ఫలాలు పొందడంతో వీరికి ఎలాంటి సంక్షేమ పథకాలు వర్తించేవి కావు. విషయం వలంటీర్ దృష్టికి తీసుకెళ్లడంతో హౌస్ హోల్డ్ మ్యాప్‌లో భార్యభర్తలను తల్లిదండ్రుల నుంచి వేరు చేసి కార్డు ఇచ్చారు. ఇకపై భార్యభర్తకు రేషన్ కార్డు రానుంది. మిగతా ప్రభుత్వ పథకాలూ వర్తిస్తాయని అతడు హర్షం వ్యక్తం చేశాడు.



## క్లుప్తంగా

### నేడు విద్యుత్ సరఫరా నిలిపి వేత

**నంద్యాల(అర్బన్):** పట్టణంలోని డి1, డి2, డి3 పరిధిల్లో ఉన్న ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏడీ ఆంథోనిరాజు శుక్రవారం తెలిపారు. లైన్లు, సబ్‌స్టేషన్ల మరమ్మతులు, రహదారిల్లోని చెట్ల తొలగింపు తదితర కార్యక్రమాల కారణంగా మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నామని, విద్యుత్ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

### పొదుపు సంఘాలతో ఆర్థికాభివృద్ధి

**ఉయ్యాలవాడ:** పొదుపు సంఘాలతోనే ఆర్థికాభివృద్ధి సాధ్యమని ఏపీఎం దాసన్న అన్నారు. శుక్రవారం వైఎస్ఆర్ కాంతి పథం కార్యాలయంలో నిర్వహించిన వీఏఓల సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు.

### విద్యార్థినికి పరామర్శ

**నంద్యాల(న్యూటౌన్):** పాము కాటుకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న 7వ తరగతి విద్యార్థి లక్ష్మీప్రసన్నను శుక్రవారం ఏఐఎస్ఎఫ్ నంద్యాల జిల్లా నాయకులు సూర్యప్రతాప్, సురేష్, ఉదయ్‌లు పరామర్శించారు.

### ఆలయంలో చోరీకి యత్నం


**దొర్నిపాడు:** మండలంలోని అర్జునాపురం గ్రామ సమీపంలో ఉన్న చిదానందస్వామి ఆలయంలో దుండగులు చోరీకి యత్నించి విఫలమైన ఘటన బుధవారం రాత్రి చోటుచేసుకోగా ఆలస్యంగా శుక్రవారం వెలుగులోకి వచ్చింది. ఆలయంలోకి చొరబడిన దుండగులు బీరువాను పగలగొట్టేందుకు యత్నించగా రాకపోవడంతో చేసేదేమీ లేక వెనుదిరిగారు. కాగా బీరువాలో రూ.1.50 లక్షల విలువ చేసే ఆభరణాలు, కొంత నగదు ఉన్నట్లు సమాచారం. ఈ విషయమై దొర్నిపాడు పోలీసులు విచారణ చేస్తున్నారు.

### ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

**ఉయ్యాలవాడ:** ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని బోడెమ్మనూరు ఎస్సీ కాలనీలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సమితి జిల్లా ఉపాధ్యక్షుడు ఓబులేస్ మాదిగ ఎమ్మార్పీఎస్ జెండాను ఎగురవేసి మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ బిల్లు పార్లమెంట్‌లో పెడతామని బీజేపీ హామీ ఇచ్చి మోసం చేసిందన్నారు. రాబోయే ఎన్నికల్లో ఆ పార్టీకి మాదిగలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

### అక్రమ కేసులు పెడితే ప్రజలే బుద్ధి చెబుతారు

**నంద్యాల(అర్బన్):** బీజేపీ ప్రభుత్వం అక్రమ కేసులు పెడితే ప్రజలే గుణపాఠం చెబుతారని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చింతలయ్య అన్నారు. శుక్రవారం గుజరాత్ హైకోర్టు కాంగ్రెస్ పార్టీ నాయకులు రాహుల్ గాంధీ వేసిన రివ్యూ పిటీషన్ కొట్టి వేయడాన్ని నిరసిస్తూ పట్టణంలో నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు ఎస్‌వైడీ ప్రసాద్, సలాం, ఆనందరావు, జాకీర్, రత్నమయ్య పాల్గొన్నారు.

### పరిసరాలు శుభ్రంగా ఉంచుకోండి

**రుద్రవరం:** పరిసరాలను శుభ్రంగా ఉంచుకుని దోమల వ్యాప్తి నివారణకు సహకరించాలని నర్సాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి బాబు సూచించారు. డెంగీ నివారణ మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం పీహెచ్‌సీ వైద్య బృందం విద్యార్థులతో కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు.

## సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబం సుభిక్షం


మహిళకు పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

**ఆళ్లగడ్డ:** సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబం సుభిక్షంగా ఉందని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆయన చాగలమర్రి 4, 5వ గ్రామ సచివాలయాల పరిధిలో పర్యటించారు. ఇంటింటికి వెళ్లి ఆప్యాయంగా పలకరించారు. నాలుగేళ్లలో పొందిన లబ్ధిని వివరించి సంక్షేమ క్యాలెండర్‌ను అందించారు. ఇంకా ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ వీరభద్రుడు, నాయకులు బాబులాల్, కుమార్‌రెడ్డి, గణేష్‌రెడ్డి, గేట్ల మాబు, సొహెల్, ఫాయజ్, ఇబ్రహీం, రమణ, నాగేంద్ర పాల్గొన్నారు.

**ఇళ్ల పట్టాల పంపిణీ**

ఆళ్లగడ్డ మండలం నందింపల్లె గ్రామంలో ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి 26 మంది పేదలకు ఇంటి పట్టాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి పాల్గొన్నారు

## డైట్ చార్జీల పెంపును సీఎం దృష్టికి తీసుకెళ్తా


మాట్లాడుతున్న చైర్మన్ ప్రతాపరెడ్డి

**నంద్యాల(అర్బన్):** జూనియర్ కళాశాలల సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థుల డైట్ చార్జీల పెంపు విషయాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ చిత్తా విజయప్రతాపరెడ్డి తెలిపారు. మెస్ చార్జీలు చేసే అధికారాన్ని కలెక్టర్లకు ఇవ్వాలని కోరుతూ జిల్లాలోని కళాశాలల సంక్షేమ వసతి గృహాల అధికారులు శుక్రవారం జిల్లా పర్యటనకు వచ్చిన చైర్మన్ విజయప్రతాపరెడ్డిని కలిసి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా హెచ్‌డబ్ల్యూఓ అసోసియేషన్ అధ్యక్షులు నాగేంద్ర, వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కళాశాలల వసతి గృహాల్లో ఔట్‌సోర్సింగ్ సిబ్బంది నియామకం చేపట్టాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌డబ్ల్యూఓలు సురేష్, షబ్బీర్, వేణుగోపాల్, ముంతాజ్, సుధారాణి, శంకరమ్మ పాల్గొన్నారు.

## 'భూమా కిశోర్‌రెడ్డీ.. నోరు అదుపులో పెట్టుకో'


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

**ఆళ్లగడ్డ:** భూమా కిశోర్‌రెడ్డీ.. నోరు అదుపులో పెట్టుకోకుంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఉయ్యాలవాడ మండలం వైఎస్సార్‌సీపీ నాయకులు బుడ్డా చంద్రమోహన్‌రెడ్డి, హరివరం ప్రసాద్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, శివప్రసాద్‌రెడ్డిలు హెచ్చరించారు. పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో శుక్రవారం వారు మాట్లాడుతూ కమీషన్ ఇవ్వలేదని సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు లబ్ధిదారులకు ఇవ్వలేదని వైఎస్సార్‌సీపీ నాయకులపై ఆరోపణలు చేయడం తగదన్నారు. బాధితులు తమ పార్టీ వారు కాకపోయినా ఎమ్మెల్యే మానవతా దృక్పథంతో సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు చేయించారన్నారు. ప్రమాదంలో ఇద్దరు మృతిచెందగా ఒక్కరి పేరు మీద చెక్కురావడంతో సరిచేసి ఇద్దరి పేరుమీద చెక్కులు మంజూరు చేయాలని కోరుతూ వెనక్కి పంపించిన విషయం అందరికీ తెలుసన్నారు. పేదలు ఇబ్బంది పడకూడదని ఉన్నతాధికారులతో మాట్లాడి ఒప్పించి సీఎం రిలీఫ్ ఫండ్ తెప్పించిన ఎమ్మెల్యేపై నోటికొచ్చినట్లు మాట్లాడితే ఊరుకునే ప్రసక్తే లేదన్నారు.

## పంచాయతీ స్థలాలు ఆక్రమిస్తే చర్యలు


గ్రామస్తులతో మాట్లాడుతున్న అధికారులు

**ఉయ్యాలవాడ:** పంచాయతీ స్థలాలను ఆక్రమిస్తే చర్యలు తప్పవని జిల్లా డీపీఓ మంజులవాణి హెచ్చరించారు. ఆక్రమణకు గురైనట్లు వచ్చిన ఫిర్యాదు నేపథ్యంలో శుక్రవారం పెద్దయమ్మనూరు గ్రామాన్ని తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, ఈఓపీఆర్‌డీ వెంకటేశ్వర్లు, ఎస్ఐ సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి నూర్‌బాషాతో కలిసి ఆమె పరిశీలించారు. గ్రామ కంఠంలో ఉన్న స్థలాన్ని ఎవరూ వినియోగించుకోరాదని గ్రామస్తులకు సూచించారు. అక్రమ కట్టడాలను తొలగించాలని ఆధికారులకు సూచించారు.

## కొల్హాపూర్ మహాలక్ష్మి అలంకారంలో కాళికాంబదేవి

**నంద్యాల(వ్యవసాయం):** స్థానిక గాంధీచౌక్‌లో వెలసిన కాళికాంబ చంద్రశేఖరస్వామి దేవస్థానంలో శుక్రవారం సందర్భంగా కాళికాంబదేవిని కొల్హాపూర్ మహాలక్ష్మిగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యాన్ని కల్పించారు. అమ్మవారికి ఒడి బియ్యం కార్యక్రమాన్ని నిర్వహించి మహామంగళ హారతులు ఇచ్చారు. అనంతరం రాహుః కాల పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పల్లకీలో కొలువుంచి ఆలయ ప్రాకారంలో ప్రదక్షిణలు చేపట్టారు. చివరగా నవవిధ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఈఓ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

**డిగ్రీ కోర్సుల ప్రవేశానికి గడువు పొడిగింపు**

**నంద్యాల(న్యూటౌన్):** డిగ్రీ ఆన్‌లైన్ ప్రవేశాల ప్రక్రియను ఈనెల 12వ తేదీ వరకు పొడిగించినట్లు పీఎస్సీ, కేవీఎస్సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ శుక్రవారం తెలిపారు.

**శిక్షణ తరగతుల పరిశీలన**

**నంద్యాల(న్యూటౌన్):** స్థానిక ఎస్‌వీఆర్, శాంతిరాం ఇంజినీరింగ్ కాలేజీలలో కొనసాగుతున్న ఇంటరాక్టివ్ ఫ్లాట్‌ప్యానల్ టీచర్స్ ట్రైనింగ్‌ను శుక్రవారం నోడల్ ఆఫీసర్ రెహమాన్ పరిశీలించారు. శిక్షణ తరగతులు 14వ తేదీ వరకు జరుగుతాయన్నారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ఎలా బోధించాలో ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ఇక్కడ నేర్చుకున్న అంశాలను తరగతి గదిలో అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో నోడల్ అధికారి బైజిన్, సుధాకర్, కోర్సు డైరెక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, ట్రైనింగ్ కో ఆర్డినేటర్లు సుందర్‌రావు, నాగేంద్రకుమార్, భాస్కరరెడ్డి, కిరణ్, సుమయూన్, జగదీష్, ఉపాధ్యాయులు, ఆర్‌పీలు సులేమాన్, అరుణ్ పాల్గొన్నారు.

**శాకాంబరిగా నిమిషాంబదేవి**

**నంద్యాల(వ్యవసాయం):** పట్టణంలోని పార్కు రోడ్డులో వెలసిన నిమిషాంబ ఆలయంలో ఆషాఢ మాసాన్ని పురస్కరించుకు అమ్మవారిని శాకాంబరి దేవిగా అలంకరించారు. తెల్లవారుజామునే సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు నిర్వహించి, ధ కూరగాయలు, ఆకుకూరలచే అలంకరింపజేసి భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం మహామంగళ హారతులు నిర్వహించి తీర్థప్రసాదాలను అందజేశారు.

**జంబులాపరమేశ్వరికి సారె సమర్పణ**

**నంద్యాల(వ్యవసాయం):** పట్టణంలోని కుందూనది ఒడ్డున వెలసిన జంబులాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి భక్తులు శుక్రవారం చీర, సారెను సమర్పించారు. భక్తులు పట్టుచీర గాజులతో పాటు 9 రకాల పిండి పదార్థాలు, తినుబండారాలతో మేళతాళాల మధ్య ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి సమర్పించారు.

## వైఎస్సార్‌సీపీలో చేరిక


పార్టీలో చేరిన వారితో గంగుల ప్రభాకర్‌రెడ్డి, బిజేంద్రారెడ్డి

**రుద్రవరం:** మండల పరిధిలోని నర్సాపురం గ్రామానికి చెందిన సుబ్బ నరసింహులు(అబ్బి), చిన్న నరసింహులు (చిన్నబ్బి), ఎంఎస్ నసింహుడు బ్రదర్స్, నాగరాజులతో పాటు మరో 30 మంది టీడీపీ వర్గీయులు శుక్రవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎర్రగుడి దిన్నెలో మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే బిజేంద్రారెడ్డి తమ స్వగృహంలో వారికి పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు.

## దళితులపై దాడులను వ్యతిరేకించాలి

**నంద్యాల(న్యూటౌన్):** దళితులపై జరుగుతున్న దాడులను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని దళిత హక్కుల పోరాట సమితి కరవధి సుబ్బారావు, సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు కోరారు. శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ దళితుల పిల్లలపై అత్యాచారాలను అరికట్టాలన్నారు. రాజ్యాంగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పకడ్బందీగా అమలు చేయాలన్నారు. దళితుల సమస్యల పరిష్కారానికి విడతల వారిగా ఆందోళనలు చేపడుతామన్నారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు గురుదాస్, గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి మోటా రాముడు, పట్టణ కార్యదర్శి ప్రసాద్ పాల్గొన్నారు.

**జిల్లా కమిటీ ఎన్నిక**

దళిత హక్కుల పోరాట సమితి నంద్యాల జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా చెన్నయ్య, ప్రభాకర్‌లతో పాటు 8 మంది సభ్యులుగా ఎన్నుకున్నారు.